సాక్షి ప్రకాశం

బుధవారం । 25 । జూన్ । 2025



విహారానికి విఘాతం

కొనకనమిట్ల మండలం చినారికట్ల వద్ద ఫారెస్టు భూముల్లో రూ.2 కోట్లతో చేపట్టిన నగర వనం పార్క్ అభివృద్ధి పనులు ఏడాదిగా నిలిచి పోయాయి.

- 8లో..

వీరయ్య హత్య కేసులో పోలీస్ కస్టడీకి నలుగురు



టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న నలుగురిని పోలీసులు విచారణ కోసం కస్టడీలోకి తీసుకున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 35 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటరు జాబితాలు

● జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ఒంగోలు సబర్బన్: పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జేసీ పాల్గొని ఓటరు జాబితాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓ యాప్ నిర్వహణ, ఓటర్ జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. తొలుత బీఎల్‌ఓ యాప్ నిర్వహణ, ఓటర్ జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఆర్‌ఓలకు, ఏఈఆర్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డీఆర్వో చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, ఈఆర్‌ఓలు కుమార్, సత్యనారాయణతో పాటు జిల్లాలోని ఎఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

రమాదేవికి నేషనల్ ఎడ్యుకేషనల్ ఇన్నోవేటివ్ శిక్షా రత్న అవార్డు



రమాదేవిని సన్మానిస్తున్న ఎంఈఓలు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని కురుమేటి రమాదేవి నేషనల్ ఎడ్యుకేషనల్ ఇన్నోవేటివ్ శిక్షా రత్న అవార్డును సాధించారు. ఈ అవార్డును ఛత్తీస్‌గఢ్ కి చెందిన నవాచారి గతి విద్యా సమూహ్ సంస్థ వారు అందజేశారు. ఈ సందర్భంగా టంగుటూరు మండల ఎంఈఓలు చెంచు పున్నయ్య, బాలాజీ జమ్ములపాలెం హైస్కూల్ హెడ్మాస్టర్ రాంబాబు, మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులని ఎంపిక చేసి నవాచారి గతి విద్యాలయ సంస్థ వారు అవార్డు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అందులో రమాదేవి ఒకరు. సర్టిఫికెట్, మెమెంటోలను పోస్టు ద్వారా పంపారు. అవార్డును టంగుటూరు మండల ఎంఈఓలు చెంచు పున్నయ్య, మహతి బాలాజీ చేతుల మీదుగా అందజేశారు.

వరుణుడి జాడ లేక.. సర్కారు జాలి చూపక!

గత సీజన్లో నష్టపోయి.. ఆర్థికంగా కుదేలైన అన్నదాత మళ్లీ కోటి ఆశలతో ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యాడు. అయితే వరుణుడు మొహం చాటేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్ ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా వాన జాడ లేకపోవడంతో విత్తనసాగు డీలా పడింది. మరో వైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవ అందలేదు. అదిగో ఇదిగో అంటూ ప్రకటనలతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది. మరో వైపు రకరకాల నిబంధనల పేరుతో 1.86 లక్షల మంది రైతులను జాబితా నుంచి తొలగించింది. జిల్లా వ్యాప్తంగా 4,62,944 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు బ్లాక్ మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో రైతు సాగుచేసేందుకు ధైర్యంగా ముందడుగు వేయలేకపోతున్నాడు.



- నవాళ్ల మధ్య ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్న
- అరకొర విత్తనాలతో రైతన్న వెతలు
- బక్కచిక్కిన అన్నదాత సుఖీభవ జాబితా
- 1,86,680 మంది రైతుల పేర్లు తొలగింపు
- భరోసా లేక దిగాలుగా రైతన్న
- అదిగో సుఖీభవ అంటూ ఊరిస్తున్న చంద్రబాబు
- ఖరీఫ్‌కు సాగర్ నీరు ఊసే ఎత్తని పాలకులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అన్నదాత సంక్షేమమే తమ లక్ష్యమని కూటమి నేతలు నమ్మించారు. ఓట్లు దండుకున్నారు. అధికారం చేపట్టాక మొదటి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు పూర్తయ్యాయి. వైఎస్సార్ రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరుమార్చారే తప్ప పైసా పెట్టుబడి సాయం విదల్చలేదు. 2025 ఖరీఫ్ సీజన్ ఆసన్నమై సాగుకు ఉపక్రమించినా పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారన్న అంశంపై స్పష్టత లేదు. విత్తనాల కొనుగోలు, దుక్కి ఖర్చులకు డబ్బులు లేక బిక్కచూపులు చూస్తున్నా స్పందించేవారే కరువయ్యారంటూ రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. పంటకు మద్దతు ధర లేకపోవడం, ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేయడం, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తుండడంపై ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని 38 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ 4,62,944 ఎకరాల్లో వరి, మిర్చి, జొన్న, రాగి, పత్తి, మినుము, కంది, ఉల్లి, కొర్ర, బెండ, మొక్కజొన్న, ఆముదం, వేరుశనగ, సోయాచిక్కుడు, కూరగాయలు తదితర పంటల సాగు చేయాల్సి ఉంది. అయితే ముందస్తు వర్షాలు ఆశలు రేకెత్తించగా ఆయా పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు, రసాయన ఎరువులు సమకూర్చుకున్నారు. ఒక వైపు వరుణుడు ముఖం చాటేయడం, మరో వైపు పాలకులు పట్టించుకోకపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు.

రైతుకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రైతును ఆదుకోవడంతోపాటు భరోసా కల్పిస్తే వ్యవసాయాన్ని పండుగలా మారుస్తాడు. గతంలో వైఎస్సార్‌సీపీ సర్కార్ ఖరీఫ్ సీజన్‌కు ముందే ఏటా మే నెలలో పెట్టుబడి భరోసా నిధులు విడుదల చేస్తూ అన్నదాతకు అండగా నిలిచిన పరిస్థితులు ఉండేవి. అప్పట్లో భూమితోపాటు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా సొమ్ములు అందాయి. ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో అందుకు విభిన్నమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళన కలిగించే పరిణామంగా మారింది.

మూలనపడిన కియోస్కులు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు ఎరువులు, పురుగుమందులు ఎంపిక చేసుకునే అవకాశం లభించింది. వాతావరణంలో మార్పులు తెలుసుకొని అందుకనుగుణంగా ప్రతి ఇంటికీ కబురుచేస్తూ రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేవారు. ప్రస్తుతం ఆ మిషన్లు మూలనపడడంతో రైతులకు సకాలంలో సలహాలు ఇచ్చేవారు కరువయ్యారు.

దోబూచులాడుతున్న నైరుతి...

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించాయి. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కూడా కురిశాయి. దీంతో రైతన్నలు ఎంతో సంబరపడ్డారు. ప్రభుత్వం రైతులపై కరుణించకపోయినా వరుణుడు కరుణించాడని. అయితే ఆ ఆశలు ఎంతో కాలం నిలువలేదు. ఖరీఫ్ సీజన్ జూన్ 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. సీజన్‌కు ముందు వర్షాలు పడటం ప్రారంభమయ్యేసరికి రైతు అప్పులు చేసి మరీ పొలాలను పంటల సాగుకు అనుగుణంగా మార్చే పనిలో నిమగ్నమయ్యాడు. కానీ తిరిగి మళ్లీ ఎండలు చుర్రుమంటూ రోహిణీ కార్తెను తలపించటం ప్రారంభించాయి. వరుణుడు ముఖం చాటేశాడు. ఆదుకోవాల్సిన పాలకులు సైతం పట్టించుకోవడం లేదు. సాగర్ జలాల విషయంలో ప్రభుత్వం పట్టించుకున్న దాఖల్లాలేవు. అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే సాగు ఎలా అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అరకొరగా విత్తనాల సరఫరా...

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం జిల్లాలోని రైతాంగానికి విత్తనాల సరఫరా అరకొరగా చేపట్టారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 4,62,944 ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా అంచనాలు రూపొందించిన జిల్లా యంత్రాంగం అందుకు అనుగుణంగా విత్తనాల సరఫరా మాత్రం చేపట్టలేదు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసరతో పాటు మూడు రకాల విత్తనాల కలయికతో కలుపుకొని జిల్లా మొత్తానికి 2,531 క్వింటాళ్లు మాత్రమే కేటాయించటం అత్యంత దారుణంగా మారింది. వాటితో పాటు వరి విత్తనాలు 4,300 క్వింటాళ్లు, మినుములు 329 క్వింటాళ్లు, పెసలు 120 క్వింటాళ్లు, కంది 1,275 క్వింటాళ్లు, నువ్వులు 65 క్వింటాళ్లు మాత్రమే ఇండెంట్ పెట్టి సరిపెట్టుకున్నారు. దీంతో రైతులు విత్తనాలు బ్లాక్‌మార్కెట్లో కొనుగోలు చేసుకుంటున్నారు.

సుఖీభవ పేరుతో ఊరిస్తున్న కూటమి సర్కార్...

టీడీపీ కూటమి సర్కారు పాలన ఏడాది పూర్తయింది. అన్నదాత సుఖీభవ పేరుతో నిధులు కుమ్మరిస్తామని ఎన్నికల హామీల్లో ఊదరగొట్టారు. మొదటి సంవత్సరం ఎగనామం పెట్టారు. రెండో ఏడాదైనా ఇస్తారనుకుంటే అదికూడా అర్హులైన రైతుల్లో భారీగా కోతలు విధించి అగమ్యగోచరంగా జాబితాలు తయారు చేశారు. జిల్లాలో 5,31,369 మంది రైతులు ఉన్నారు. చివరకు 4,38,251 మందిని గుర్తించినట్లు ప్రాథమికంగా జాబితాలు సిద్ధం చేశారు. అనంతరం కోతల్లో 2,51,571 మందిని అర్హులుగా తేల్చారు. 1,86,680 మంది పేర్లను జాబితాల నుంచి తొలగించారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఉండి ఉంటే మొదటి ఏడాది ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటికే ముందుగానే మొదటి విడత రూ.6,500 నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది.

ఆగని కనిష్ట ధర పతనం



కొండపిలో పొగాకు వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి

కొండపి: పొగాకు వేలంలో కనిష్ట ధర పతనం ఆగడం లేదు. వేలం ప్రారంభంలో రూ.240 పలికిన కనిష్ట ధర ప్రస్తుతం రూ.160కి పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరిగితే కనీసం పెట్టుబడులైనా వస్తాయని ఆశతో ఉన్న రైతులకు కనిష్ట ధరల పతనంతో నష్టాల్లో కూరుకుతున్నారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1019 బేళ్లను తీసుకురాగా 721 బేళ్లను కొనుగోలు చేసి 298 బేళ్లను తిరస్కరించారు. సరాసరి ధర రూ.246.70గా నమోదైంది. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొట్లపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 292 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 869 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 577 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి రూ.240.26గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

బంగారు బాల్యం సర్వే 10 రోజుల్లో పూర్తి చేయాలి

- సమస్యల బారిన పడే చిన్నారుల గుర్తింపును వేగవంతం చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు సబర్బన్: బంగారు బాల్యం యాప్ ఆధారిత సర్వేను పది రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యల బారిన పడే (వల్నరబుల్) చిన్నారుల గుర్తింపుతో పాటు ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్, బడి వయసు పిల్లలు అందరూ బడిలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రతి పాఠశాలలో ఈ తరహా పిల్లలను గుర్తించే బాధ్యతను నోడల్ ఆఫీసర్‌గా ఒక టీచరుకు అప్పగించాలని ఆమె చెప్పారు. ఆధార్ కార్డు లేని ఆరేళ్లలోపు పిల్లలు కూడా ఆధార్ కార్డులు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ కార్డులు పొందలేకపోతున్న వారిని గుర్తించి, ఈనెల 27వ తేదీన జనన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు అర్హులతో దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. బడి వయసు కలిగిన పిల్లలు సుమారు 13 వేల మంది ఇప్పటికీ బడి వెలుపల ఉన్నారని, వీరందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల 1,2,3 తేదీల్లో ఒకటి, రెండు, మూడవ తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, డీఈఓ కిరణ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీఓ దినేష్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి , ఒంగోలు ఆర్డీవో లక్ష్మి ప్రసన్న , నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ, ఎంపీడీవోలు, సీడీపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు హాజరయ్యారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక మినీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు జరుగుతుంది. అండర్ 10 కేటగిరీలో పాల్గొనేందుకు 2016 జనవరి 1వ తేదీ, అండర్ 12 కేటగిరీలో పాల్గొనేందుకు 2014 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, సొంత కిట్టుతో ఎంపికకు హాజరుకావాలి. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7671991147 లేదా 9182366146లను సంప్రదించాలని కార్యదర్శి జి.నవీన్ తెలిపారు.

ఏక్ సాల్ కౌలుదారు.. ప్లాట్లేశాడు



రోడ్లు తొలగిస్తున్న కమిషనర్



ఆక్రమించి వేసిన పైపుల తొలగింపు

- వక్ఫ్‌భూముల్లో రోడ్లు, ప్లాట్లు
- తొలగించిన కమిషనర్

పొదిలి: ముస్లింలకు చెందిన పెద్ద, చిన్న మసీదుల నిర్వహణకు వక్ఫ్ భూముల నుంచి వచ్చే కౌలు ఆదాయం ఆధారం. నిర్వహణతో పాటు, చిన్న పాటి మరమ్మతులకు ఆదాయంలో ఖర్చు చేస్తుంటారు. జమా ఖర్చులను కమిటీతో పాటు, ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షిస్తుంటారు. వక్ఫ్ భూములు రైల్వే లైన్‌కు అటు ఇటు సుమారు 300 ఎకరాలు ఉన్నాయి. ఏటా కౌలు వేలం నిర్వహిస్తుంటారు. వక్ఫ్ భూముల కమిటీ అధ్యక్షుడు ఇటీవల విదేశాలకు వెళ్లాడు. ఈవిషయమై సీఈఓకు సమాచారం ఇచ్చాడు. తాను మూడు నెలల పాటు అందుబాటులో ఉండటం లేదని, కమిటీ వారితో కలిసి, అధికారులు భూములు వేలం నిర్వహించుకోవాలని సూచించారు. భూముల కౌలు వేలానికి ముందుగా ప్రకటనలు ఇస్తారు. పాంప్లేట్ల ద్వారా ప్రచారం జరుగుతుంది. కమిటీ సభ్యులు, అధికారుల సమక్షంలో ఈనెల 12వ తేదీన భూములు వేశారు. మొత్తం 153 ఎకరాలకు గాను, వేలంలో 23 మంది పాల్గొన్నారు. ఈ వేలంలో రూ.9,50,900 ఆదాయం సమకూరింది.

సర్వే నెంబర్ 820లో కిరి కిరి:

12వ తేదీన జరిగిన వేలంలో సర్వే నంబర్ 820లో రెండు ఎకరాల విస్తీర్ణానికి వేలం జరగలేదు. ఎవరూ లేక పోటీ రాలేదా, లేదా అంతకు ముందుగా వేసుకున్న పన్నాగమో కానీ మిగిలిన భూములతో పాటు వేలం జరగలేదు. కమిటీలో పదవులు ఉన్న ఇద్దరు సదరు భూమిని ఏక్‌సాల్ కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయించారు. దీనిని కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన పి.పెద్దయ్య అనే వ్యక్తికి రూ.9,200లు కౌలు నిర్ణయించి రసీదు ఇచ్చారు. వ్యవసాయం కోసమే, తాత్కాలిక పంటలను మాత్రమే కౌలుదారులు వేసుకోవాలని నిబంధనల్లో తెలియపరుస్తారు. అయితే సదరు రెండు ఎకరాలు భూమి పొందిన పెద్దయ్య ఆ భూమిలో ప్లాట్లు వేశాడు. రోడ్డు కూడా వేయించి, సెంటు రూ.20 నుంచి రూ.30 వేల ప్రకారం అమ్మకానికి సిద్ధం చేశాడు.



కౌలుదారునికి ఇచ్చిన రశీదు

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు:

స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌కు ఆక్రమణల విషయమై స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన కమిషనర్ వెంటనే యంత్రాలతో రోడ్లను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వక్ఫ్ భూములను కాపాడాలని స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాట్లు వేయటం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అధికారులపై పలు ఆరోపణలు చేశారు. దీంతో స్పందించిన వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ బాష పొదిలికి వచ్చారు. కౌలుకు ఇచ్చిన కమిటీ వారు తనకు సమాచారం ఇవ్వలేదని, నగదు జమ చేయలేదని అహ్మద్ బాష చెప్పారు. జరిగిన విషయంపై ఆరా తీశారు. కౌలుదారు పెద్దయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఎస్సై వేమనను వివరణ కోరగా, ఫిర్యాదు అందిన మాట వాస్తవమన్నారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అన్నాచెల్లెలి కిడ్నాప్‌పై కేసు నమోదు

నల్లమాడ(అనంతపురం): అన్నాచెల్లెలును కిడ్నాప్ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నల్లమాడ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు.. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం నల్లమడుగుల గ్రామానికి చెందిన గాయపు అంకమ్మ, ఏసురత్నం దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కట్టెలు కాల్చి బొగ్గుల చేసే పనిపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అంకమ్మ తన కుటుంబసభ్యులతో కలసి సోదరుడు సమరం నగేష్ వెంట ఇటీవల నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి వలస వచ్చి బొగ్గులు కాల్చే పనిని చేపట్టారు. ఈ నెల 22న రాత్రి ఒంటి గంట సమయంలో ఏసురత్నం ఇంట్లో లేని సమయంలో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బొగ్గుల వ్యాపారి (సేటు) ఎం.యంగయ్య, మరో నలుగురు వచ్చి అంకమ్మ, ఆమె సోదరుడు నగేష్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని పోయారు. 23న వారి బారి నుంచి తప్పించుకుని ఇద్దరూ దొన్నికోటకు చేరుకున్నారు. అదే రోజు రాత్రి నల్లమాడ పోలీసులకు అంకమ్మ ఫిర్యాదు చేశారు. పాత బాకీ తీర్చాలంటూ తనను, తన సోదరుడిని యంగయ్య, మరో నలుగురు కిడ్నాప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ అనంతరం మంగళవారం కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వీరయ్య హత్య కేసు..

పోలీస్ కస్టడీకి నలుగురు నిందితులు

- వినోద్‌ను కొప్పోలులోని ఇంటికి తీసుకెళ్లి విచారించిన పోలీసులు



ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బోర్లగుంట వినోద్ కుమార్, ఆళ్ల సాంబశివరావు అలియాస్ సిద్దాంతి, గోళ్ల రుష్యేంద్ర బాబు, ఓబిలి నాగరాజును మంగళవారం ఉదయం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. జిల్లా జైలు నుంచి నేరుగా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ నుంచి తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించి డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు నేతృత్వంలో విచారణ ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల సమయంలో వీరయ్య హత్యలో ప్రధాన పాత్రధారిగా చెబుతున్న వినోద్ కుమార్‌ను తీసుకుని కొప్పోలులోని అతని నివాసానికి తీసుకెళ్లి విచారించారు. ఈనెల 27వ తేదీ వరకు నలుగురు నిందితులను పోలీసు తమ కస్టడీలోనే ఉంచి విచారించనున్నారు. మరో వైపు ప్రధాన సూత్రధారిగా పోలీసులు చెబుతున్న ముప్పా సురేష్ ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బెయిల్ దొరకకపోతే పోలీసులకు లొంగిపోవచ్చని స్థానికంగా ప్రచారం నడుస్తోంది.

విహారానికి విఘాతం!

- చినారికట్ల వద్ద ఫారెస్ట్ భూముల్లో 'నగర వనం'
- ఏడాది కాలంగా నిలిచిన పార్కు అభివృద్ధి పనులు
- గత ప్రభుత్వంలో పార్కు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు
- ఇప్పటి వరకు 1.40 కోట్ల రూపాయలు ఖర్చు..
- మిగిలిన నిధులు విడుదల చేయకుండా సర్కారు తాత్సారం


పిల్లలు ఆడుకునే చోట గడ్డి పెరిగి ఇలా..


నగర వనం ఆర్చి

కొనకనమిట్ల:

అటవీ భూముల్లో నగర వనం పార్క్ నిర్మించి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు చేపట్టిన ప్రాజెక్టు అర్ధంతరంగా నిలిచిపోయింది. నిధుల మంజూరుకు సర్కారు కొర్రీ వేయడమే పనులు నిలిచిపోవడానికి కారణం. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వంలో ఒంగోలు–గిద్దలూరు రహదారి వెంట కొనకనమిట్ల మండలం చినారికట్ల జంక్షన్ సమీపంలో నగర వనం పార్క్ ఏర్పాటుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో చినారికట్ల సమీపంలో రహదారి పక్కనే ఉన్న ఫారెస్ట్ భూములు సుమారు 100 ఎకరాల్లో వన విహారి–నగర వనం పేరిట అహ్లాదకరంగా ఉండే పార్క్ నిర్మాణం చేపట్టారు. గత ఐదేళ్లలో పార్క్ ముందు నగర వనం పేరిట కలపతో ఆర్చి, టికెట్ ఇచ్చేందుకు చిన్న రూము, పిల్లలు ఆడుకొనేందుకు పలు రకాల క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా మినరల్ వాటర్ ప్లాంట్, బాత్‌రూమ్, మీటింగ్ హాల్, భోజన శాల, కలపతో అతిథి గృహాలు నెలకొల్పారు. వీటన్నింటికీ ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు ఖర్చు చేశారు.

నగర వనంలో పని చేసేందుకు వాచ్‌మెన్, టికెట్లు విక్రయించేందుకు, పార్క్ పనుల పర్యవేక్షణకు నలుగురిని నియమించారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ పార్కు నిర్మాణానికి సంబంధించి మిగిలిన నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఆగిపోయాయి. లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో క్రీడా పరికరాలు తుప్పు పడుతున్నాయి.

పర్యాటకులు తగ్గుముఖం

గతంలో పార్క్‌ను తిలకించేందుకు, ఆడుకునేందుకు పొదిలి, కొనకనమిట్ల ప్రాంతాల నుంచి పర్యాటకులు, చిన్నారులు వచ్చేవారు. పార్క్ సందర్శన ఫీజు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా వసూలు చేయగా సుమారు నాలుగు నెలల్లోనే రూ.లక్ష ఆదాయం సమకూరినట్లు సమాచారం. అయితే పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేయకపోవటం, పార్క్‌లో పని చేసే సిబ్బందికి వేతనం ఇవ్వకపోవటంతో ముగ్గరు మానేయడం, నిర్వహణ సక్రమంగా లేకపోవడం తదితర కారణాలతో పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. నగర వనం మొత్తం గడ్డి పెరిగి, గతంలో చేసిన అభివృద్ధి పనులు సైతం అస్తవ్యస్తంగా మారాయి. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే నగర వనం కోసం ఇప్పటి వరకు ఖర్చుపెట్టిన రూ.1.40 కోట్లు బూడిదలో పోసిన పన్నీరవుతాయని పర్యాటకులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ డీఆర్ఓ నాయక్‌ను వివరణ కోరగా.. 'నగర వనం పనులు నిధులు మంజూరైన మేరకు పార్క్‌లో పలు రకాల క్రీడా పరికరాలు, షెడ్‌లు ఏర్పాటు చేశాం. మిగతా నిధులు మంజూరైతే పార్క్ నిర్మాణాన్ని పూర్తి చేసి, సిబ్బందిని నియమించి అహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.


నగర వనంలో ఇంకా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతం


అతిథి గృహం


నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్

కాపులను బీసీల్లో చేర్చాలి


పాదయాత్రకు సంఘీబావం తెలియజేస్తున్న కాపు నాయకులు

గిద్దలూరు రూరల్: కాపులు, బలిజలను బీసీల్లో చేర్చాలని కోరుతూ చిత్తూరు జిల్లా నుంచి కాపు సమితి నాయకుడు ప్రసాద్ గత 15 రోజులుగా పాద యాత్ర చేస్తూ మంగళవారం గిద్దలూరు చేరుకున్నారు. పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయం వద్ద కాపు నాయకులు ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ.. కాపులు, బలిజలను బీసీల్లో చేర్చి రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ చిత్తూరు జిల్లా నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి కాపులను బీసీల్లో చేర్చాలని వినతి పత్రాన్ని అందజేస్తామని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు రంగసుబ్బయ్య, పసుపులేటి శ్రీను, దుత్తా బాలఈశ్వరయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌-18 కబడ్డీ పోటీలకు సింగరాయకొండ విద్యార్థిని


త్రిగుణ

సింగరాయకొండ: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అండర్–18 బాలికల కబడ్డీ పోటీలకు సింగరాయకొండలోని ఏఆర్సీ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కుర్రు త్రిగుణ ఎంపికైనట్లు పీడీ కె.శంకర్రావు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈనెల 28 నుంచి జూలై ఒకటో తేదీ వరకు జరిగే జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున త్రిగుణ ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. కాగా తనను ప్రోత్సహించిన గొల్లపాలెం ఉన్నత పాఠశాల పీడీ హజరత్తయ్య, కళాశాల పీడీ శంకర్రావుకు త్రిగుణ కృతజ్ఞతలు తెలియజేసింది.

మందుబాబుకు రిమాండ్

- మద్యం మత్తులో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో..

టంగుటూరు: పూటుగా మద్యం తాగి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి సింగరాయకొండ కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. టంగుటూరు గ్రామానికి చెందిన ఉనిమేదల కామేశ్వరరావు మద్యం తాగి అదే కాలనీలో ఉంటున్న జరుబుల సుబ్బారావు, ఆయన కుమార్తెను చెప్పలేని రీతిలో బూతులు తిడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించాడు. వారిద్దరినీ చంపుతానని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కామేశ్వరరావును అరెస్టు చేశారు. మంగళవారం సింగరాయకొండ కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించామని ఎస్సై వివరించారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులివ్వాలి

- రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో జేసీ గోపాల కృష్ణ
- సమన్వయంతో పనిచేసి లక్ష్యం పూర్తి చేయాలని సూచన


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు కార్డులను మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 46,015 మందికి సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారని, ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఆర్డీఓలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గృహనిర్మాణ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సమావేశమై రెవెన్యూ అంశాలకు సంబంధించి పీజీఆర్ఎస్ పెండింగ్, రీ వెరిఫికేషన్ ఆఫ్ హౌస్ సైట్స్, హౌస్ సైట్ అప్లికేషన్స్, వాటర్ టాక్స్ కలెక్షన్, కోర్టు కేసుల పురోగతి, రీ సర్వే ప్రక్రియ, నిత్యావసర సరుకుల పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు తదితర అంశాలపై కూడా సమీక్షించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి నివేశన స్థలాల అర్జీలు, అర్హులు వివరాలు, ఎంత స్థలం అందుబాటులో ఉంది తదితర వివరాలపై గ్రామాల వారీగా పూర్తి నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామ స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, పౌర సరఫరాల శాఖ డీఎం వరలక్ష్మి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, వివిధ సెక్షన్ల సుపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడు.. పర్యావరణ ప్రేమికుడు

- పర్చూరుకు చేరుకున్న సైకిల్ యాత్రికుడు సెల్వన్


ముత్తు సెల్వన్‌ను అభినందిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

పర్చూరు(చినగంజాం): ప్రపంచ శాంతి, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా సైకిల్‌పై యాత్ర చేస్తూ ప్రపంచ పర్యటన చేస్తున్న ముత్తు సెల్వన్ మంగళవారం పర్చూరు చేరుకున్నారు. పర్చూరులో తహసీల్దార్ బ్రహ్మయ్య ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ 2021 డిసెంబర్ 28న సైకిల్‌పై ప్రయాణం ప్రారంభించి దేశంలోని అన్ని ప్రాంతాలను పర్యటిస్తున్నారు. ప్రాణవాయువు కొరత కారణంగా ఎవరూ మృతి చెందకూడదన్న లక్ష్యాన్ని ఎంచుకొని సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తూ మార్గమధ్యంలో మొక్కలు నాటుతూ ముందుకు సాగుతన్నానని సెల్వన్ వివరించారు. రోజుకు 50 కిలోమీటర్ల చొప్పున 1111 రోజుల్లో 39,900 కి.మీ ప్రయాణించి, మొత్తం 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

తన ప్రయాణంలో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్‌లోనూ పర్యటించనున్నట్లు చెప్పారు. పర్చూరులో తహసీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అనంతరం సెల్వన్‌కు ప్రశంస పత్రం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదం


చిన్నయ్య మృతదేహం

కందుకూరు: జాతీయ రహదారి 167బీపై మంగళవారం తెల్లవారుజామున ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి కారు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మంగళవారం వలేటివారిపాలెం మండలంలోని పోకూరు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన స్వర్ణ చిన్నయ్య(44) అనే రైతు మంగళవారం వేకువజామున పొగాకు బేళ్లు ట్రాక్టర్‌కు ఎత్తుకుని కందుకూరులోని వేలం కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో కందుకూరు సమీపంలోని పోకూరు గ్రామం వద్దకు చేరుకునే సరికి కదిరి నుంచి కందుకూరు వైపు వస్తున్న కారు వేగంగా వెనుకవైపు నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో ట్రాక్టర్ నడుపుతున్న చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ సలీంబాషతో పాటు, కారులోని వారికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.